సాక్షి విశాఖపట్నం

శనివారం । 11 । జనవరి । 2025



ఫన్‌డుగ..

సంక్రాంతి పండగ..
సంబరాలు నిండుగ..
పంటల పండగ..
పతంగుల ఎగరగ

పిండివంటల ఘుమఘుమలు
రంగవల్లికల సొబగులు
గంగిరెద్దుల సందళ్లు
బావామరదళ్ల సరదాలు





సంప్రదాయ వస్త్రధారణలో...

ఈ సంరంభానికి వేదికైంది ఏవీఎన్ కళాశాల.. ముందస్తు సంక్రాంతి వేడుకలతో పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించింది. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో మెరిశారు. రోజంతా ఉల్లాసంగా గడిపారు.

– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఇల వైకుంఠం





వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉత్తర ద్వార దర్శనం కోసం శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకున్నారు. సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్తరద్వార దర్శనం వైభవంగా జరిగింది. ఆలయ ఉత్తర రాజగోపురంలో శ్రీదేవి, భూదేవి సమేతుడై స్వామి శేషతల్పంపై కొలువుదీరి భక్తులకు ఉత్తర ద్వార దర్శన భాగ్యాన్ని అందజేశారు. మురళీనగర్‌లోని వైభవ వేంకటేశ్వరస్వామి ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు పోటెత్తారు. – సింహాచలం/మురళీనగర్



ఉత్తర రాజగోపురంలో అప్పన్న చెంతన వేదపారాయణం చేస్తున్న పండితులు (ఇన్‌సెట్) అప్పన్న రూపంలో పుష్పాలంకరణ



వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో వైభవ వేంకటేశ్వరస్వామి

నలుగురు హెచ్‌సీలకు బదిలీ

ఎంవీపీకాలనీ: విశాఖపట్నం పోలీసు కమిషనరేట్ పరిధిలో నలుగురు హెడ్ కానిస్టేబుళ్లు, ఇద్దరు పీసీలను బదిలీ చేస్తూ సీపీ కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో కొందరిని లా అండ్ ఆర్డర్‌కు, మరికొందరిని క్రైమ్ పోలీసు స్టేషన్లకు బదిలీ చేశారు. బదిలీ అయిన ఆయా హెచ్‌సీలు, పీసీలను ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న సంబంధిత స్టేషన్ సీఐలు తక్షణమే రిలీవ్ చేయాలని ఆదేశించారు.

జైల్ సుధార్ కేంద్రంలో భోగి పిడకల విక్రయాలు




జైల్ సుధార్ కేంద్రంలో విక్రయిస్తున్న భోగి పిడకల దండలు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో భోగి పిడకలు విక్రయాలు జరుపుతున్నారు. సంక్రాంతి సందర్భంగా వీటిని తయారు చేశారు. ఇక్కడ వ్యవసాయం చేసే ఓపెన్ జైల్ ఖైదీలు జైల్ డెయిరీ ఫారంలో ఉన్న ఆవుల పేడతో భోగి పిడకలు తయారు చేశారు. బీఆర్‌టీఎస్‌ను ఆనుకొని జైల్ ప్రధాన ద్వారం వద్ద నిర్వహిస్తున్న జైల్ సుధార్ కేంద్రంలో వీటిని విక్రయిస్తున్నారు. 58 భోగి పిడకలను దండగా చేసి రూ.100 చొప్పున విక్రయిస్తున్నారు. నగరంలో పలు ప్రైవేట్ పాఠశాలలు, పలు అపార్ట్‌మెంట్లు నుంచి ఇండెంట్లు రావడంతో ఎక్కువగా తయారు చేసినట్లు జైల్ అధికారులు తెలిపారు.

వైద్యుల నియామకం

మధురవాడ: ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలోని ఆయుర్వేద డిస్పెన్సరీలకు కొత్తగా 39మంది వైద్యులు నియమితులయ్యారని మధురవాడలోని ఆయుష్ జోన్-1(విశాఖ) ప్రాంతీయ ఉప సంచాలకులు దానేటి ఝాన్సీలక్ష్మి తెలిపారు. వీరిలో 19 మందికి శుక్రవారం నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ బుకీలకు కూటమి అండ



- ఎస్‌బీ కానిస్టేబుల్ కీలక పాత్ర..!
- నెలనెలా మామూళ్లు తీసుకుంటున్న కూటమి ఎమ్మెల్యే
- బుకీలో సభ్యులు ఎమ్మెల్యే అనుచరులే..
- పరారీలో ముగ్గురు..
- వారం క్రితం బుకీని అరెస్టు చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :



ఇసుక, మద్యం సిండికేట్లలో హవా కొనసాగిస్తున్న కూటమి ఎమ్మెల్యే క్రికెట్ బెట్టింగ్‌నూ వదలడం లేదు. నెలనెలా మామూళ్లు వసూలు చేస్తున్నారు. బెట్టింగ్‌లో కూటమి ఎమ్మెల్యే అనుచరులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. వీరితో పాటు ఓ స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్‌కు కూడా నెలవారీ మామూళ్ల వసూలు చేసే బాధ్యతను కూటమి ఎమ్మెల్యే అప్పగించినట్టు తెలుస్తోంది. ఆయన అండదండలు పుష్కలంగా ఉండడంతో సదరు కానిస్టేబుల్ లక్షల్లో వసూలు చేసి ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది.

కొద్ది రోజుల క్రితం క్రికెట్ బెట్టింగ్ ముఠాలోని ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకోగా.. సదరు కానిస్టేబుల్ వ్యవహారం బయటపడింది. అయితే కూటమి ఎమ్మెల్యేకు కానిస్టేబుల్ బాగా కావాల్సిన వ్యక్తి కావడంతో ఎఫ్ఐఆర్‌లో ఆయన పేరు తప్పించినట్టు తెలిసింది. అధికారం అడ్డం పెట్టుకుని కూటమి ఎమ్మెల్యే, సదరు కానిస్టేబుల్ వ్యవహారంపై ఇంటెలిజెన్స్ బాస్‌కు పోలీసులు సమాచారం చేరవేసినట్టు తెలుస్తోంది.

కొద్దిరోజుల క్రితం క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న సమాచారంతో ఇసుకతోట, శివాజీ పాలెం ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. అతనితోపాటు మరో ఇద్దరు కూటమి ఎమ్మెల్యే అనుచరులు కూడా బెట్టింగ్ వ్యవహారంలో ఉన్నట్టు తేలింది. వీరితో పాటు ఈ తంతు నడిపిస్తూ నెలవారీ మామూళ్లను కూటమి ఎమ్మెల్యేకు చేరవేయడంలో కీలకంగా ఉన్న ఒక స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ జోలికి వెళ్లకుండా ఇద్దరు కూటమి ఎమ్మెల్యేలు రంగంలోకి దిగినట్టు తెలుస్తోంది. నెలనెలా భారీగా మామూళ్లు దండుకుంటున్న ఓ కూటమి ఎమ్మెల్యే అనుచరులే లక్షల్లో బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. వీరి ముఠా విశాఖ నుంచి కాకినాడ మీదుగా హైదరాబాద్ వరకూ పాకినట్టు తెలుస్తోంది. ఈ ముఠా జోలికి వెళ్లకుండా ఉండాలని పోలీసులకు ఫోన్లు చేసి మరీ ఓ కూటమి ఎమ్మెల్యే పీఏగా చెప్పుకుంటున్న బంధువు బెదిరించే స్థాయిలో వ్యవహారం నడిపిస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతానికి ఐదుగురు బెట్టింగ్ ముఠా సభ్యులపై కేసులు నమోదు కాగా.. కీలకంగా వ్యవహరిస్తున్న కానిస్టేబుల్ వ్యవహారం మాత్రం ఇంకా అధికారికంగా తేలాల్సి ఉంది.

విశాఖ టు హైదరాబాద్ వయా కాకినాడ..

ఈ క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో విశాఖలోని శివాజీపాలెం, ఇసుకతోట, డాబాగార్డెన్స్, ఆనందపురం, చోడవరం ప్రాంతాలకు చెందిన వ్యక్తులు కీలకంగా వ్యవహరిస్తున్నారు. వీరందరూ కాకినాడ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి సహకారంతో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. ఈ ముఠా గురించి తీగ లాగితే... హైదరాబాద్ వరకూ పాకినట్టు తెలుస్తోంది. క్రికెట్ బెట్టింగ్‌లో పట్టుబడిన వ్యక్తి తన ఫోన్ పే నంబరు ((91003 46888)తో పాటు మరో నాలుగు ఐసీఐసీఐ, ఐడీఎఫ్‌సీ బ్యాంకు అకౌంట్లకు భారీగా ఈ బెట్టింగ్ నగదును జమ చేసినట్టు తేలింది. ఈ బ్యాంకు అకౌంట్లు చోడవరం, కాకినాడ ప్రాంతానికి చెందిన వివిధ కంపెనీలకు చెందినవి కావడం గమనార్హం. రుద్రా ఆక్వా ట్రేడర్స్, అభిరామ ఆక్వా ట్రేడర్స్, శ్రీ దుర్గా స్టీల్ ప్రొడక్ట్స్, ప్రజ్ఞ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన కంపెనీల అకౌంట్లుగా తేలింది. పెదవాల్తేరు డాక్టర్స్ కాలనీలోని గాయత్రీ టవర్స్‌లోని తన అపార్టుమెంటులో ల్యాప్‌టాప్ ద్వారా వ్యవహారాలను సాగించారు. శివాజీపాలెం, ఇసుకతోటకు చెందిన ముగ్గురు కూడా ఇందులో భాగస్వాములుగా ఉన్నారు. వీరిలో ముగ్గురిపై సైబర్ క్రైమ్ పోలీసులు కేసులు నమోదు చేశారు. అయితే ఇందులో కీలకంగా ఉన్న స్పెషల్ బ్రాంచ్‌కు చెందిన కానిస్టేబుల్ జోలికి మాత్రం వెళ్లలేదన్న విమర్శలున్నాయి.

నెలవారీ మామూళ్లు...!

విశాఖలో క్రికెట్ బుకీల హవా పెరిగిపోతోంది. ప్రతి చిన్న మ్యాచ్‌కూ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. ఆఫ్‌లైన్‌లో బాక్స్ క్రికెట్ ఆడుతున్న కుర్రాళ్లను పరిచయం చేసుకుంటూ... ఆన్‌లైన్ బెట్టింగ్‌కు దింపుతున్నారు. మొదట్లో వందల్లో ప్రారంభించి... చివరకు లక్షల దాకా ఈ బెట్టింగ్‌ను నిర్వహిస్తున్నారు. క్రికెట్ బుకీలుగా కూటమి ఎమ్మెల్యేకు అనుచరులుగా ఉన్న ఇద్దరితో పాటు ఓ కానిస్టేబుల్ కూడా కీలకంగా ఉన్నారు. మీకు ఏం కాకుండా చూసుకుంటాననంటూ.. నెలవారీగా లక్షల్లో మామూళ్లు తీసుకుంటున్నారు. ఈ వసూళ్ల వ్యవహారమంతా స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ చూసుకుంటున్నారు. ఇప్పటికే కేసులు నమోదైన ఎమ్మెల్యే అనుచరులు దొరకకుండా తప్పించుకున్నారు. ఓవైపు మద్యం సిండికేట్లలో హవా కొనసాగిస్తున్న సదరు కూటమి ఎమ్మెల్యే... ఇప్పుడు క్రికెట్ బెట్టింగ్‌లోనూ కీలకంగా ఉన్నారనే సమాచారం ఇంటెలిజెన్స్ వర్గాలు వారి అధినేత దృష్టికి తీసుకెళ్లినట్టు తెలుస్తోంది.

పోలీసులకే బెదిరింపులు...?

వాస్తవానికి కొద్దిరోజుల క్రితం ఈ క్రికెట్ బెట్టింగ్ ముఠా వ్యవహారాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు తమకు వచ్చిన పక్కా సమాచారంతో బయటకు లాగారు. ఆ తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాలతో సైబర్ క్రైమ్ పోలీసులకు ఈ కేసును అప్పగించారు. అయితే, మొదట్లో పట్టుబడిన రవితోపాటు ఎమ్మెల్యే అనుచరులనూ అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. అంతేకాకుండా వీరితో పాటు ఒక క్రైం బ్రాంచ్ కానిస్టేబుల్ కూడా ఉన్నట్టు తేలింది. ఈయనను కూడా అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నాలు జరిగాయి. ఇది తెలిసిన వెంటనే కూటమిలోని ఒక ఎమ్మెల్యేకు అనధికారి పీఏగా వ్యవహరిస్తున్న ఆయన బంధువు పోలీసులకు ఫోన్ చేసి ఏకంగా బెదిరింపులకు దిగినట్టు తెలుస్తోంది. సదరు పీఏనే పోలీసు పోస్టింగుల్లో కూడా భారీగా వసూలు చేసి స్టేషన్లను అలాట్ చేయించారన్న విమర్శలున్నాయి. అయితే పోలీసులు ఎమ్మెల్యే బంధువు ఒత్తిళ్లకు తలొగ్గకపోవడంతో.. మరో కూటమి ఎమ్మెల్యేను రంగంలోకి దింపి కేసు నుంచి వీరిని తప్పించినట్టు ప్రచారం జరుగుతోంది. తాజాగా నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో కానిస్టేబుల్ పేరు లేకుండా చేశారనే ప్రచారం జరుగుతోంది.

రేపు శ్రీనృసింహ దీక్షల విరమణ

సింహాచలం : సింహగిరిపై ఆదివారం ఉదయం 7గంటల నుంచి శ్రీనృసింహ దీక్షల విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు సింహాచలం దేవస్థానం అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. దీక్షాధారులందరిచేత దీక్ష విరమణను శాస్త్రోక్తంగా దేవస్థానం వైదికులు నిర్వహించనున్నారు. 41 రోజుల శ్రీనృసింహ దీక్ష, 32 రోజుల శ్రీనృసింహ దీక్ష తీసుకున్నవారంతా ఆదివారం సింహగిరిపై దీక్ష విరమణ చేయాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

పోలీసుల దర్యాప్తు ఆధారంగా చర్యలు

సెల్‌ఫోన్ల వ్యవహారంపై ఐజీ ఇండ్ల శ్రీనివాస్ వ్యాఖ్య

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో ఖైదీల బ్యారక్‌ల వద్ద దొరికిన నాలుగు సెల్‌ఫోన్ల వ్యవహారంపై పోలీసులు దర్యాప్తులో వెల్లడైన విషయాల ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాస్ తెలిపారు. విశాఖ కేంద్ర కారాగారాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. జైలు డిప్యూటీ సూపరింటెండెంట్లు ప్రవీణ్‌కుమార్, జవహర్‌బాబు, జైలర్లతో కలిసి ఆయన పలు విభాగాలను పరిశీలించారు. బ్యారక్‌ల వద్ద ఖైదీలతో మాట్లాడి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇటీవల సెల్‌ఫోన్‌లు దొరికిన బ్యారక్‌లను పరిశీలించి.. సెల్‌ఫోన్‌లు ఎక్కడ దాచిపెట్టారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. జైలులో మరింత పటిష్టమైన రక్షణ చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రస్తుతం 9 సీసీ కెమెరాలు పని చేస్తున్నాయని, వాటి సంఖ్యను 496కు పెంచుతామన్నారు. రాష్ట్రంలోని అన్ని జైళ్లలో 400 మంది సిబ్బంది నియామకానికి సన్నాహాలు జరుగుతున్నాయని వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని జైళ్లలో రూ.100 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నామన్నారు. విశాఖ జైలులో రూ.15 కోట్లు, రాజమండ్రిలో రూ.33 కోట్లు, కడప జైలులో రూ.5 కోట్లతో అదనపు బ్యారక్‌ల నిర్మాణం, దర్శి జైలును రూ.35 కోట్లతో ఆధునికీకరించనున్నట్లు వివరించారు. మిగిలిన నిధులతో సీసీ కెమెరాలు, టెక్నాలజీ పనులు, ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేస్తామన్నారు. సుమారు 200 మంది అర్హులైన శిక్ష పడిన ఖైదీల క్షమాభిక్ష కోసం ప్రభుత్వానికి జాబితా పంపించామని, ఈ విషయంలో ప్రభుత్వం నిర్ణయం కోసం వేచి ఉన్నట్లు ఐజీ తెలిపారు.

తారు రోడ్లపై భోగి మంటలు వేయవద్దు

డాబాగార్డెన్స్: నగర ప్రజలు తారు రోడ్లపై భోగి మంటలు వేయవద్దని జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. జీవీఎంసీ నిధులతో నగర ప్రజల సౌకర్యార్థం వేసిన రోడ్లపై భోగిమంటలు వేయడం ద్వారా తారు కరిగి రోడ్లపై గుంతలు ఏర్పడతాయన్నారు. జీవీఎంసీకి ఆర్థిక నష్టం వాటిల్లుతోందని, అందువల్ల రోడ్లపై భోగి మంటలు వేయకుండా, మైదానం లేదా ఖాళీ ప్రదేశాల్లో ప్రజలు వేసుకోవాలని కోరారు.

గుండె పగిలే వేదన

- తిరుపతి తొక్కిసలాటలో మృతులకు అంత్యక్రియలు
- కన్నీరుమున్నీరైన బంధువులు



కండిపిల్లి శాంతి మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

కంచరపాలెం: తిరుపతిలో తొక్కిసలాటలో దుర్మరణం చెందిన కండిపిల్లి శాంతి మృతదేహం విశాఖ చేరుకోవడంతో కుటుంబంలో విషాద ఛాయలు కమ్ముకున్నాయి. కంచరపాలెంలో శాంతి పుట్టింటి వద్ద మృతదేహం ఉంచడంతో శుక్రవారం కుటుంబ సభ్యులు బంధువులు, స్థానికుల రోదనలు మిన్నంటాయి. స్థానిక కంచరపాలెం బర్మా క్యాంప్ శ్మశాన వాటికలో దహన సంస్కారాలు చేపట్టారు. శాంతి భర్త కండిపిల్లి వెంకటేష్ తలకొరివి పెడుతుంటే కుమారుడు వరప్రసాద్ రోదన అందరి్నీ కంటతడి పెట్టించింది. మృతదేహానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే విష్ణు కుమార్‌రాజు నివాళులర్పించారు.

కష్టమంటే తెలియకుండా పెంచింది



అమ్మ చనిపోయిందంటే ఇప్పటికీ నమ్మలేకున్నా.. చిన్నప్పటి నుంచి కష్టం తెలియకుండా పెంచింది. అన్ని మమ్మీయే చూసుకునేది. ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇస్తే మా మమ్మీ తిరిగొస్తుందా?

– కండిపిల్లి వరప్రసాద్, శాంతి కుమారుడు

రద్దీలో వద్దనుకున్నా.. అంతలో దుర్ఘటన

- రజని భర్త లక్ష్మారెడ్డి
- తల్లి మృతదేహం వద్ద బోరున విలపించిన హర్షవర్ధన్
- నేడు అంత్యక్రియలు



తల్లి మృతదేహం వద్ద హర్షవర్ధన్

మద్దిలపాలెం: రద్దీగా ఉండడంతో క్యూలోంచి బయట వెళ్లిపోదాం అనుకున్నంతలో చోటుచేసుకున్న తొక్కిసలాటలో తన భార్య రజని ప్రాణాలు కోల్పోయిందని భర్త గుడ్ల లక్ష్మారెడ్డి భోరుమంటూ విలపించారు. అప్పటి వరకూ ఇద్దరం కలిసి క్యూలో జాగ్రత్తగా వెళ్తున్న సమయంలో రద్దీ అధికమవ్వడంతోపాటు గేట్లు తెరిచారని, దీంతో జనం ఒక్కసారిగా క్యూలో కదలడం పలువురి ప్రాణాలు పోవడానికి కారణమయిందని మద్దిలపాలేనికి చెందిన మృతురాలు రజని భర్త లక్ష్మారెడ్డి వాపోయారు.

రెండు గంటల తర్వాత జాడ తెలిసింది

'తొక్కిసలాటలో తప్పిపోయిన రజని కోసం వెతుకుతున్నా. ఎక్కడా జాడలేదు. దీంతో ఏం చేయాలో తెలియలేదు. నా చేతిలో ఫోన్‌కూడా రజనీ బ్యాగులో ఉండిపోయింది. దీంతో అక్కడే వున్న ఆటో డ్రైవర్ ఫోన్ ద్వారా కాల్ చేస్తున్న పని చేయలేదు. ఏం జరిగిందో తెలియదు. రెండు గంటల తర్వాత ఆస్పత్రిలో చేర్పించారని సమాచారం అందింది. ఆ ఆస్పత్రి ఎక్కడుందో తెలియక ఆటో ద్వారా అక్కడి చేరుకున్నా. వెళ్లి చూసే సరికి విగత జీవిగా పడి ఉంది'అంటూ బోరున విలపించారు.

అమెరికా నుంచి హుటాహుటిన వచ్చిన హర్షవర్ధన్ రెడ్డి.. తల్లి భౌతికకాయాన్ని చూసి సొమ్మసిల్లిపోయాడు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు రజనీ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నేడు అంత్యక్రియలు

అమెరికా నుంచి మృతురాలి తమ్ముడు శనివారం విశాఖ వస్తున్నారు. అతను రాగానే అంత్యక్రియలు నిర్వహిస్తామని భర్త లక్ష్మారెడ్డి తెలిపారు.

లావణ్య మృతదేహానికి అంత్యక్రియలు



లావణ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీతంపేట: తిరుపతి తొక్కిసలాట ఘటనలో మరణించిన సూరిశెట్టి లావణ్య మృతదేహానికి స్థానిక జగన్నాథపురం శ్మశానంలో ప్రభుత్వ లాంఛనాలతో శుక్రవారం అంత్యక్రియలు జరిగాయి. తెల్లవారు జామున 3 గంటలకు విశాఖ చేరిన మృతదేహాన్ని అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్‌లో సందర్శనార్థం ఉంచారు. లావణ్య భర్త, కుమార్తెలు, కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో ఆ ప్రాంతంలో విషాదం అలుముకుంది. ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ తదితరులు లావణ్య మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. దహన సంస్కారాల నిమిత్తం ప్రభుత్వ సాయాన్ని అర్బన్ ఎమ్మార్వో రమేష్‌బాబు అందించారు.

బోరున విలపించిన కుమార్తెలు : మృతదేహం విశాఖ చేరడానికి కొద్దిసేపటి ముందు లావణ్య మృతి చెందిన విషయం ఆమె కుమార్తెలకు తెలిపారు. దీంతో కుమార్తెలిద్దరూ షాక్‌కు గురయ్యారు. తల్లిని విడిచి ఎప్పుడు ఒక్క క్షణం ఉండలేని పిల్లలు, తల్లి ఇక లేదన్న విషయాన్ని తట్టుకోలేక తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. తిరుపతి వెళ్లే ముందు అమ్మ చెప్పిన మాటలు గుర్తుచేసుకుని బోరున ఏడ్చేశారు.

ఇల వైకుంఠం

- వైభవంగా అప్పన్న ఉత్తరద్వార దర్శనం
- శేషతల్పంపై వైకుంఠవాసుడిగా దర్శనమిచ్చిన స్వామి
- పరవశించిన భక్తజనం


స్వామి పల్లకీ మోస్తున్న అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజు, ఈవో త్రినాథరావు

సింహాచలం: వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్తరద్వార దర్శనం వైభవంగా జరిగింది. ఆలయ ఉత్తర రాజగోపురంలో శ్రీదేవి, భూదేవి సమేతుడై స్వామి శేషతల్పంపై కొలువుదీరి భక్తులకు ఉత్తరద్వార దర్శన భాగ్యాన్ని అందజేశారు. ఏడాదిలో ఒక్క రోజులో కేవలం కొన్ని గంటలు మాత్రమే లభించే ఈ అరుదైన దర్శనాన్ని తనివితీరా చేసుకుని భక్తులు పరవశించారు. భక్తిపారవశ్యంలో మునిగితేలారు.

తెల్లవారుజామున ఒంటి గంట నుంచి వైదిక కార్యక్రమాలు

పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి శుక్రవారం తెల్లవారుజామున ఒంటి గంట నుంచి వైదికులు విశేషంగా పూజలు నిర్వహించారు. స్వామిని సుప్రభాతసేవతో మేల్కొలిపి ఆరాధన చేపట్టారు. స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని వైకుంఠవాసుడిగా అలంకరించారు. శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను విశేషంగా తీర్చిదిద్దారు. అనంతరం స్వామిని, అమ్మవార్లను మేలిముసుగులో ఉంచి శేషతల్పంపై అధిష్ఠింపజేసి.. ఆలయ బేడామండపంలో తిరువీధి నిర్వహించారు. ఆది నుంచి వస్తున్న ఆచారం ప్రకారం తొలుత ఆలయ ఉత్తరద్వారం వద్ద కొంతసేపు స్వామిని అధిష్ఠింపజేసి.. స్వామిపై ఉన్న మేలిముసుగు తొలగించారు. అక్కడ తొలిదర్శనాన్ని దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతి రాజుకు అందజేశారు. అక్కడి నుంచి స్వామిని తీసుకెళ్లి ఆలయ ఉత్తర రాజగోపురంలో ఏర్పాటు చేసిన వేదికపై అధిష్ఠింపజేశారు. ఉదయం 4.30 గంటల నుంచి 11.30 గంటల వరకు భక్తులకు దర్శనాన్ని అందజేశారు. అనంతరం స్వామికి సింహగిరి మాడవీధిలో తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, గిరి, రంగనాథ్ తదితరులు పూజలు నిర్వహించారు.

విశేషంగా ఏర్పాట్లు

ముక్కోటిని పురస్కరించుకుని దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో అన్నిశాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. లా అండ్ ఆర్డర్ నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, గోపాలపట్నం సీఐ గొలగాని అప్పారావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు. గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ట్రాఫిక్‌ను నియంత్రించారు. అడవివరం ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో మూడు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, భక్తులకు వైద్య సదుపాయం కల్పించారు. అన్నదాన భవనంలో భక్తులకు పొంగలి, పులుసును అందజేశారు. దర్శనానంతరం భక్తులకు ఆలయ దక్షిణ రాజగోపురం మాడ వీధిలో ఉచితంగా ప్రసాదం అందించారు.



ఉత్తర రాజగోపురంలో కొలువుదీరిన అప్పన్న స్వామిని దర్శించుకుంటున్న భక్తులు


స్వామి దర్శనానికి క్యూల్లో వేచి ఉన్న భక్తులు

దర్శనం చేసుకున్న ప్రముఖులు

దివంగత అనువంశిక ధర్మకర్త ఆనందగజపతిరాజు సతీమణి సుధాగజపతిరాజు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, గణబాబు, పల్లా శ్రీనివాస్, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, అనకాపల్లి జేసీ ఎం.జాహ్నవి తదితరులు స్వామి ఉత్తరద్వార దర్శనం చేసుకున్నారు.

వైకుంఠ నారాయణుడిగా..

కొమ్మాది: వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి భక్తులకు వైకుంఠ నారాయణుడిగా దర్శనమిచ్చారు. సర్వాభరణాలు, మహాలక్ష్మి, గోదాదేవి సమేతంగా ఉత్తర ద్వారంలో స్వామి శుక్రవారం భక్తులకు దర్శనమివ్వగా, తనివితీరా స్వామిని స్మరించుకున్నారు. తెల్లవారుజామున 3.30 గంటలకు ఆలయాన్ని తెరచి తిరుప్పావై ధనుర్మాస ఆరాధన గంట, తోమాల, సుప్రభాత సేవ అనంతరం 4 గంటల నుంచి భక్తులకు దర్శన భాగ్యాన్ని అందించారు. శ్రీవారిని దర్శించుకునేందుకు వేకువ జాము నుంచి రాత్రి వరకు వేలాది మంది భక్తులు కిలో మీటర్ల మేర బారులుదీరారు. కొండ దిగువ భాగం నుంచి, మెట్ల మార్గం, ఆలయ వెనుక భాగం రోడ్డు భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయాన్ని వివిధ వర్ణాల పూలతో, విద్యుత్ కాంతులతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఏఈవో జగన్‌మోహనాచార్యులు పర్యవేక్షించారు. ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తులకు టీటీడీ అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్లు శివకుమార్, కిశోర్, శ్రావణ్ పాల్గొన్నారు. సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు కనులపండువగా సాగాయి. శ్రీ రాధా దామోదరులు శ్రీ వేంకటేశ్వరస్వామి, పద్మావతిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని వైకుంఠ ఏకాదశి ప్రాముఖ్యంపై ప్రవచించారు.


రుషికొండలో కొలువైన వేంకటేశ్వర స్వామి


ఇస్కాన్‌లో పుష్పయాగం

వైభవం..వైకుంఠనాథుని దర్శనం


స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మురళీనగర్: ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఉత్తర ద్వార దర్శనం శుక్రవారం వైభవంగా జరిగింది. వైభవుడి ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సివిల్, ట్రాఫిక్ పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. అర్చకులు వాసుదేవాచార్యులు, శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 2.45 గంటలకు స్వామి సుప్రభాత సేవ చేపట్టారు. 3.30గంటలకు స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి దర్పణ దర్శనం, గోపృష్ఠదర్శనం, కన్యాదర్శనం నిర్వహించారు. తిరుప్పావై సేవా కాలంలో భాగంగా గోదాదేవి తరఫున శ్రీరంగనాథుడికి 26వ పాశురం వినిపించారు. 5.30 గంటలకు భూదేవి, శ్రీదేవి సమేతంగా స్వామి ఉత్సవ విగ్రహాలను తిరువీధిలో ఊరేగించి. శేషవాహనంపై స్వామిని తోడ్కొని వచ్చారు. ఉత్తర ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై అధిష్ఠించిన అనంతరం 6 గంటల నుంచి దర్శనాలు ప్రారంభమయ్యాయి. ముందుగా ఉత్తర ద్వారం నిర్మాత తిప్పల రవిశంకర్ కుటుంబసభ్యులు, ఆలయ ఈవో బందారు ప్రసాద్ దంపతులు, నిర్మాణ కమిటీ సభ్యులు, సంపూర్ణ సేవా భక్తులు, నిత్యపారాయణ భక్తులకు దర్శనాలు కల్పించారు. అనంతరం భక్తుల దర్శనాలు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2గంటల వరకు దర్శనాలకు స్వల్ప విరామం ఇచ్చారు. 15వేల రన్నింగ్ ఫీట్ కలిగిన క్యూలు, 8వేల మంది భక్తులు వేచి ఉండే విధంగా ఏర్పాటు చేయడంతో దర్శనాలు సులువుగా జరిగాయి. ఏసీపీ కాళిదాసు పర్యవేక్షణలో లా అండ్ ఆర్డర్ సీఐ చంద్రశేఖర్, ట్రాఫిక్ సీఐ దాశరథి ఆధ్వర్యంలో శాంతి భద్రతలు పర్యవేక్షించారు. 250 మంది వలంటీర్లు నిరంతరం క్యూల వద్ద ఉండి భక్తుల దర్శనాలకు సహకరించారు.

అక్కడ అధికారులే కాంట్రాక్టర్లు!

వీఎంఆర్డీఏలో సిత్రాలు

- కైలాసగిరిపై బ్యాటరీ కార్లను తిప్పేందుకు ఇద్దరికి ఆర్డర్లు
- ఇందులో ఒక ఆపరేటర్‌గా ప్రణాళిక ప్రకారం చక్రం తిప్పిన అధికారి?
- ఒప్పందం కంటే ఎక్కువ వసూలు చేస్తున్న నిర్వాహకుడు
- షోకాజ్ నోటీసులు జారీ చేసిన వీఎంఆర్డీఏ ఉన్నతాధికారులు

విశాఖ సిటీ: ఆ శాఖలో అధికారులే కాంట్రాక్టర్లుగా వ్యవహరిస్తున్నారు. వారి మనుషులతోనే దరఖాస్తులు పెట్టిస్తున్నారు. వారికే వారే పనులు, ప్రాజెక్టులు కేటాయించుకుంటున్నారు. దీంతో ప్రాజెక్టులు వారి సొంతం అవుతున్నాయి. బిల్లులు వారి అనుచరుల ఖాతాల్లోకి వెళ్తున్నాయి. ఇదీ విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్డీఏ) అధికారుల పనితీరు. ఈ శాఖలో కొందరు అధికారులు రెండు చేతులా కాదు, అంతకు మించి సంపాదిస్తున్నారు. ఇంజినీరింగ్ నుంచి అటవీ శాఖ వరకు అన్ని శాఖల్లోనూ కొందరు ఇదే తరహాలో భారీగా వెనకేసుకుంటున్నారు. కొద్ది రోజుల కిందట అటవీ శాఖలో జరిగిన వ్యవహారం మరువక ముందే, తాజాగా కైలాసగిరిపై బ్యాటరీ కార్ల ఆపరేటర్ విషయంలో అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి.

టెండర్లు లేకుండానే ఆర్డర్లు

వీఎంఆర్డీఏ పరిధిలో ఎవరు పనులు, ప్రాజెక్టులకైనా టెండర్లను ఆహ్వానించాల్సి ఉంటుంది. పీపీపీ ప్రాజెక్టులకైతే కనీసం ఆసక్తి వ్యక్తీకరణకైనా దరఖాస్తులను స్వీకరించాలి. కానీ ప్రస్తుతం కైలాసగిరిపై మాత్రం ఎటువంటి టెండర్లు లేకుండానే బ్యాటరీ కార్ల నిర్వహణ ఆర్డర్లు ఇచ్చేయడం గమనార్హం. ఇదిలా ఉంటే.. ఒకే తేదీన(2024, నవంబర్ 30) ఇద్దరు ఆపరేటర్లు వీఎంఆర్డీఏకు అనుమతుల కోసం లేఖలు అందజేయడం, ఒకే ఫైల్ నంబర్ 17027/47/2024తో ఇరువురికి ఉత్తర్వులు ఇవ్వడం చర్చనీయాంశమవుతోంది.

ఒక ఆపరేటర్‌గా అధికారి?

ఈ ఆపరేటర్లు ఇద్దరిలో ఒకరు వీఎంఆర్డీఏ అధికారి తెరవెనుక ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక ప్రణాళిక ప్రకారం అధికారి తన అనుచరుడితో బ్యాటరీ కార్‌ను నిర్వహిస్తున్నారని వీఎంఆర్డీఏలో చర్చ జరుగుతోంది. వీటి నిర్వహణకు లైసెన్సు ఫీజు కింద కేవలం రూ.10 వేలు మాత్రమే నెలకు వసూలు చేస్తుండడం విశేషం. నిత్యం వందల మంది పర్యాటకులు సందర్శించే కైలాసగిరిపై అన్ని పర్యాటక కేంద్రాలకు తిప్పే ఈ బ్యాటరీ కార్లకు నామమాత్రపు చార్జీలు వసూలు చేయడంపై కూడా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే ఒక్కో ప్యాసింజర్ నుంచి రూ.20 వసూలు చేయాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. అయితే ఆపరేటర్ మాత్రం అధికంగా రూ.50 వరకు వసూలు చేస్తున్నారు. దీనిపై వీఎంఆర్డీఏ అధికారులకు ఫిర్యాదులు సైతం అందాయి.

ఆపరేటర్లకు నోటీసులిచ్చాం

బ్యాటరీ ఆపరేటర్లకు నోటీసులు ఇచ్చాం. ఒకరు నిర్ణీత సమయంలో బ్యాటరీ కార్లను నడపడంలేదు. మరొకరు నిర్ణీత రుసుం కంటే ఎక్కువ వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదు వచ్చాయి. దీంతో ఇరువురికి నోటీసులు అందజేశాం. వారి నుంచి వివరణ వచ్చిన తరువాత తగిన చర్యలు తీసుకుంటాం. అధికార ధరలు వసూలు చేస్తున్నా పట్టించుకోని అధికారులపై కూడా చర్యలు తప్పవు.

-కె.ఎస్.విశ్వనాథన్, మెట్రోపాలిటన్ కమిషనర్

సరదాల సంక్రాంతి


సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న అధ్యాపకులు


గంగిరెద్దు వద్ద యువతుల సందడి


భోగి మంటలు వద్ద విద్యార్థులు

ఏవీఎన్ కళాశాల విద్యార్థులు శుక్రవారం సంక్రాంతిని ఉత్సాహంగా, ఉల్లాసంగా జరుపుకున్నారు. పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించేలా కళాశాలను అలంకరించారు. కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు భోగి మంటలతో సంక్రాంతి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమల విశిష్టతను విద్యార్థులకు వివరించారు. మన సంస్కృతి, సంప్రదాయాల గురించి ఇప్పటితరం పిల్లలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కళాశాలలో అన్ని వేడుకలు జరుపుకోవడం ద్వారా విద్యార్థులకు ఆయా పండగల ప్రాధాన్యాన్ని తెలియజేస్తున్నామని చెప్పారు. వేడుకల్లో డూడూ బసవన్నలు, కొమరదాసులు, హరిదాసులు సందడి చేశారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి.. సంబరాల్లో ఆటపాటలతో అందరినీ అలరించారు. గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

– డాబాగార్డెన్స్

రౌడీషీటర్ విస్కీపై పీడీ యాక్ట్

అల్లిపురం: నగరంలోని వన్‌టౌన్ ప్రాంతం చెంగలరావుపేట, ఆశిపాప వీధికి చెందిన రౌడీషీటర్ గంధ సంతోష్ అలియాస్ గంధం సంతోష్, అలియాస్ విస్కీపై ప్రివెంటివ్ డిటెన్షన్ యాక్ట్ (పీడీ యాక్ట్) విధిస్తూ శుక్రవారం జీవో నంబర్ 63 విడుదలైంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చికి, సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌కు ఈ ఉత్తర్వులు పంపించింది. గంధ సంతోష్ అలియాస్ విస్కీపై తీవ్రమైన ఆరోపణలు ఉండటంతో అతన్ని 12 నెలల పాటు నిర్బంధంలో ఉంచనున్నారు. కాగా.. ఇప్పటికే అతన్ని గతేడాది నవంబర్ 22న అరెస్ట్ చేయంతో జైలులో ఉన్నాడని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

ఫన్ బకెట్ భార్గవ్‌కు 20 ఏళ్ల జైలు

విశాఖ లీగల్: మాయ మాటలతో బాలికను నమ్మించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ నగరంలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనంది శుక్రవారం తీర్పు చెప్పారు. బాలికకు రూ.4 లక్షలు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.వి.ఆర్.మూర్తి అందించిన వివరాలు.. నిందితుడు చిప్పాడ భార్గవ్ అలియాస్ ఫన్ బకెట్ భార్గవ్ నగరంలోని పూర్ణామార్కెట్ దగ్గర కొబ్బరితోటలో ఉంటున్నాడు. సినిమాల్లో నటించిన అనుభవంతో పాటు టిక్ టాక్ వీడియోలు చేసేవాడు. బాధిత బాలిక కూడా అదే ప్రాంతానికి చెందినది. 9వ తరగతి చదివింది. నిందితుడు బాలికకు వివిధ రకాల వీడియోలు చూపించి లోబరుచుకున్నాడు. అంతటితో ఆగకుండా ఆమెపై తరచూ లైంగిక దాడికి పాల్పడేవాడు. దీంతో బాధిత బాలిక తల్లి ఫిర్యాదు మేరకు, అప్పటి దిశ పోలీస్ స్టేషన్ అధికారి డాక్టర్ ప్రేమ్ కాజల్ నిందితుడిపై భారతీయ శిక్షాస్మృతి పలు సెక్షన్ల కింద, పోక్సో చట్టం సెక్షన్ 5 కింద కేసు నమోదు చేశారు. నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.



ద్వారకా బస్ స్టేషన్‌లో టికెట్ కౌంటర్ల వద్ద రద్దీ

డాబాగార్డెన్స్: ఆర్టీసీకి సంక్రాంతి పండగ వచ్చింది. ప్రయాణికులతో ద్వారకాబస్టేషన్ కిటకిటలాడుతోంది. అడ్వాన్స్ బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు సంతోషపడుతుంటే..ముందుగా టికెట్ బుకింగ్ చేసుకోలేని ప్రయాణికులు సీట్ల కోసం ఎగబాకుతున్నారు. పాఠశాలలకు సంక్రాంత సెలవులు ఇవ్వడంతో ప్రజలు ఊళ్ల బాట పట్టారు. దీంతో ఒక్కసారిగా ద్వారకాబస్టేషన్‌కు ప్రయాణికులు పోటెత్తారు. ఆర్టీసీ యాజమాన్యం కూడా ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది. ఆర్టీసీ బస్సులు కూడా రద్దీగా ఉండడంతో కొందరు ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. దీంతో ప్రైవేట్ ట్రావెల్స్ టికెట్ ధరలు అమాంతం పెంచేశాయి.

పెందుర్తి సీహెచ్‌సీలో అరుదైన ఘటన

నాలుగున్నర కిలోల ఆడ శిశువు జననం


విజయవంతంగా శస్త్రచికిత్స చేసిన వైద్య బృందం

పెందుర్తి: సాధారణంగా మూడున్నర కిలోలు దాటి శిశువు పుడితేనే ఆశ్చర్యంగా చూస్తాం. అలాంటిది ఒక మహిళ ఏకంగా నాలుగున్నర కిలోల ఆడ శిశువుకు జన్మనిచ్చి అందరినీ అబ్బురపరిచింది. పెందుర్తిలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఈ అరుదైన ఘటన చోటుచేసుకుంది. సింహాచలం ప్రాంతంలో నివాసం ఉంటున్న పి.రవితేజ తన భార్య హైమని ప్రసవం కోసం పెందుర్తి సీహెచ్‌సీలో చేర్పించారు. అయితే ప్రసవం ఆలస్యం కావడంతో పరీక్షలు నిర్వహించగా బిడ్డ అధిక బరువు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. డాక్టర్ టి.అరుణాదేవి, డాక్టర్ హర్షశ్రీ బృందం హైమకు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించి ప్రసవం చేయించారు. ఆమె నాలుగున్నర కిలోల ఆడ శిశువు జన్మించింది. ప్రస్తుతం తల్లీ బిడ్డా ఆరోగ్యంగా ఉన్నారని, రెండు మూడు రోజుల్లో డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు తెలిపారు.

విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌లో సంక్రాంతి ఆఫర్లు

విశాఖ సిటీ: నగరంలోని విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌లో పలు క్రీడలకు సంక్రాంతి ఆఫర్స్ అందిస్తున్నట్లు క్లబ్ చైర్మన్ బొడ్డేటి కాశీ విశ్వనాథం ఓ ప్రకటనలో తెలిపారు. గో కార్టింగ్, వాటర్ వరల్డ్, స్విమ్మింగ్ పూల్, 12డీ థియేటర్, గియాంట్ స్వింగ్, 360 డిగ్రీస్ సైకిల్, రాకెట్ ఎజెక్టర్.. ఇలా పలు క్రీడలకు ఆఫర్లు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు అన్ని క్రీడా విభాగాలపై 20 శాతం డిస్కౌంట్ ఉంటుందని వివరించారు. ఈ అవకాశాన్ని విశాఖ ప్రజలు వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విశ్వనాథం స్పోర్ట్స్ క్లబ్‌కు ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమైన యూనిక్ టూరిజం ప్రాజెక్ట్ అవార్డును అందజేసిందన్నారు.

ముగిసిన అంధుల మహిళా క్రికెట్ జట్టు శిక్షణ

విశాఖ స్పోర్ట్స్: జాతీయ స్థాయి అంధుల మహిళా క్రికెట్ టోర్నీలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. కేరళలోని కొచ్చిన్‌లో ఈ నెల 13 నుంచి ఈ పోటీలు ప్రారంభం కానున్నాయి. విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ కమిటీ ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖరరెడ్డి స్టేడియంలో వారం రోజుల పాటు ఈ శిబిరం జరిగింది. ఈ సందర్భంగా జట్టును ఆంధ్ర క్రికెట్ సంఘం అపెక్స్ కౌన్సిల్(ఏసీఏ) కార్యదర్శి సానా సతీష్‌బాబు అభినందించారు. కొచ్చిన్‌లో ఆడేందుకు శనివారం బయలుదేరి వెళ్లనున్న జట్టు సభ్యులకు విమాన ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్నారు.

నేషనల్ పారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్ ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్: మెడ్‌టెక్ జోన్ (ఏఎంటీజెడ్)లో బోకియా నేషనల్ పారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ పోటీలను వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్, లెఫ్టినెంట్ జనరల్ ఎన్ఎస్ రాజా సుబ్రమణి ప్రారంభించారు. సంకల్పం, నైపుణ్యం, క్రీడా స్ఫూర్తితో 21 రాష్ట్రాలకు చెందిన వంద మంది పారా అథ్లెట్లు ఈ పోటీల్లో పోటీపడుతున్నారు. ఇక్కడ విజేతలుగా నిలిచిన వారికి ఆసియా పారా గేమ్స్‌లో పాల్గొనే అవకాశాన్ని పరిశీలిస్తారు. ఈ నెల 15వ తేదీతో ముగియనున్న ఈ పోటీల్లో సెరిబ్రల్ పాల్సీ, కండరాల బలహీనతతో సహా తీవ్రమైన వైకల్యాలు ఉన్న అథ్లెట్లు తమ అసాధారణ నైపుణ్యాలను, పోటీ స్ఫూర్తిని ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా లెఫ్టినెంట్ జనరల్ సుబ్రమణి మాట్లాడుతూ ఏఎంటీజెడ్ దేశాభివృద్ధికి అద్భుతమైన సహకారాన్ని అందిస్తోందన్నారు. వైద్య సాంకేతికతలో పురోగతి సాధించడమే కాకుండా 'మేక్ ఇన్ ఇండియా', 'వికసిత్ భారత్' దృక్పథంతో కంపెనీలు వృద్ధి చెందడానికి ప్రేరణ, ఉపాధి, ప్రోత్సాహం పొందేలా పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన ఏఎంటీజెడ్‌లో పర్యటించారు. దేశ ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేసే ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు పలు కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఆత్రేయం భవనానికి శంకుస్థాపన చేశారు. సహాయక సాంకేతికత కోసం అధునాతన పరిశోధన, ఆవిష్కరణ కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రారంభోత్సవంలో ఏఎంటీజెడ్ ఎండీ, వ్యవస్థాపక సీఈవో జితేంద్ర శర్మ, బోకియా ఇండియా చైర్మన్ అశోక్ బేడీ, అధ్యక్షుడు జస్ప్రీత్ సింగ్, స్పోర్ట్స్ సమాఖ్య కార్యదర్శి షమిందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

పీసీసీ అధ్యక్షురాలు షర్మిల మౌనదీక్ష



మౌనదీక్షలో పాల్గొన్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

సీతమ్మధార: రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల మౌన దీక్ష చేపట్టారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం ఆమె నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. 'జై బాపూజీ, జై భీమ్, జై సంవిధాన్' నినాదాలతో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అమిత్ షాను బర్తరఫ్ చేయాలని ప్లకార్డుల ద్వారా డిమాండ్ చేశారు. దీక్షలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్ ఠాగూర్, నాయకులు రుద్రరాజు, మస్తాన్ వలీ, సత్యారెడ్డి, ఉత్తరాంధ్ర ఆరు జిల్లాల నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశ కీర్తి ప్రతిష్టలు పెంచాలి

- నితీశ్‌కుమార్‌తో ఏసీఏ కార్యదర్శి సతీష్


నితీశ్‌ను అభినందిస్తున్న ఏసీఏ కార్యదర్శి సతీష్

విశాఖ స్పోర్ట్స్: ఆస్ట్రేలియాతో జరిగిన ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో పాల్గొని, తొలి సెంచరీ నమోదు చేసిన విశాఖ ఆల్‌రౌండర్ కాకి నితీశ్‌కుమార్ రెడ్డిని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి సానా సతీష్‌బాబు అభినందించారు. విశాఖ చేరుకున్న నితీశ్‌కుమార్ శుక్రవారం ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. త్వరలో జరగనున్న ఇంగ్లాండ్–భారత్ టీ 20, వన్డే సిరీస్‌లతో పాటు చాంపియన్స్ ట్రోఫీకి నితీశ్ ఎంపికవుతాడనే ఆశాభావాన్ని ఈ సందర్భంగా సతీష్ వ్యక్తం చేశారు. దేశానికి, ఏసీఏకు కీర్తి ప్రతిష్టలు పెంచే విధంగా కృషి చేయాలని, అందుకు తగిన సహాయ సహకారాలను ఏసీఏ అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ వెంకటరామ ప్రశాంత్, కౌన్సిలర్ గౌర్ విష్ణు, ఏసీఏ గేమ్ డెవలప్‌మెంట్ జీఎం ఎంఎస్ కుమార్, ఏజీఎం శివకుమార్ పాల్గొన్నారు.